# కంచు మోగినట్లు
# కనకంబు మోగునా

నాగేశ్వర్రావు అనే డ్రైవరు, డియమ్ ఓ నాశ్రయించి కాళ్ళవేళ్ళా పడి, జిడ్డులాగా వదలలేదు. పెద్ద కుటుంబమన్నాడు, కాళ్ళు పట్టుకున్నాడు.

అన్నం పెట్టించండి బాబూ, మెకానిక్‌ని గూడానూ, క్లీనర్‌గా గూడా పనిచేస్తా, కొన్నాళ్ళు లారీ క్లీనర్‌గా సర్వీసున్నది అని ఘోషపెట్టి డ్రైవర్ జాబ్ తెచ్చుకోగలిగాడు. యూనిఫామ్ ప్రభుత్వమే యెలాట్ చేస్తారు. మళ్ళా సొద వెళ్ళబోసి దీనాలాపాలాడి క్వార్టర్స్ యిప్పించమని క్వార్టర్స్ ఆక్రమించ గలిగాడు నాగేశ్వర్రావు. జబ్బు నటిస్తూ క్వార్టర్స్ దూరమైందని సైకిల్ కొనిపించుకున్నాడు, రెండేళ్ళలో వసూళ్ళు, మామూళ్ళూ లాగి భోజనం పెట్టించమనీ, కాంప్ వెళ్ళినచోట జబర్దస్తీ చేసీ, డబ్బు మిగుల్చుకునీ పదివేలు బాంక్‌లో వేయగలిగాడు.

క్లీనర్ని ప్యూన్‌గా వేయించుకుని యింటికి వేయించుకోవాలని బాబుతో చెప్పండి. అసలు మీకు రూల్స్ ప్రకారం చేతికింద నలుగురు జమాన్లు వుండాల, మీకు అధికారమివ్వాల అని యజమానురాలికి హితోపదేశం చేశాడు చట్టం తెలిసినవానిలాగా.

ఆ నలుగురికీ తిండీ బట్టా, యీనాములు, వుచిత వైద్యమూ అందించాల్సి వుంటుంది నాగేశ్వర్రావ్. అందుకని హక్కు వున్నా, నీ చేతికిందికి నలుగుర్ని ప్యూన్లను వేయను

అంటారు బాబు. నా సంగతి సరేలే, నీ తమ్ముడు పాసైనాడా, మీ ఆవిడకి పైల్స్‌కి శస్త్రచికిత్స చేయించావా, హాస్పటల్లో బెడ్ దొరికిందా? బాబు యిప్పించారా? అని సింపతీ చూపుతూ మార్దవంగా అడిగింది యజమానురాలు.

నా తమ్ముడు చెడు సావాసాలు చేసి చదవక, క్రికెట్ ఆడుతూ పరీక్ష తప్పాడు. వాడు ఆ సావాసాలు మానేసి చద వాలే గాని యెమ్మే చదివిస్తాను, ఐ యె యెస్‌కి పంపుతా. ఇయాల ఓ యాభై రూపాయలు అర్జంటుగా కావాల, మీ రివ్వాలి, మీటర్ బిల్, కరెంట్ బిల్, సైకిల్ రిపేర్స్ బిల్, లైసెన్సు కట్టీయాల, లేకపోతే కరెంటు డిస్కనెక్ట్ చేస్తాడు, పోలీసోడు దీపమేదిరా అని సైకిల్ లాక్కుంటాడు అంటుండగా డియమ్‌వో పోలీస్ వాహనం లోంచి దిగటం చూసి వెళ్ళి పోయాడు నాగేశ్వర్రావు, అతను వెళ్ళినవేపే చూసింది శివ కామేశ్వరి గృహిణి.

శివకామేశ్వరి కారు తోలుకుంటూ వచ్చి, గుడిముందు ఆపింది, అక్కడే మరోపక్క కారునానుకుని నిలబడి వున్న నాగేశ్వర్రావు శివకామేశ్వరిని చూసి తన కారువదిలి వచ్చాడు. శివకామేశ్వరి కారు దిగి యిగ్నిషన్ కీస్ పర్సులో వేసి, కారు డోర్ మూసింది, దగ్గరగా వచ్చి అన్నాడు.

బాబు కారూ దాని రిపేర్సూ భరించలేక అమ్మేశారని ప్యూన్ చెప్పాడే. మీరు కారు తోలట మెప్పుడు నేర్చారూ, యెవరు నేర్పారూ? నన్నడగలేదేం నేర్పమని, లైసెన్సు తెచ్చుకున్నారా? మీకు కారు తోలేందుకు డ్రైవర్ కావాలని

నాకు కబురు పెడితే, పార్ట్‌టైమ్ డ్రైవర్‌గా వచ్చేవాడినే, లేదా చౌకగా డ్రైవర్ని కుదిర్చేవాడిని. మీరు గుళ్ళోకెళ్ళినప్పుడు కారు దగ్గర మనిషి వుండాల అన్నాడు.

బాబు యిప్పుడు డియమ్‌వో కాదు. నీకు కబురు పెడదా మనుకున్నా గానీ, నీ బంగ్లా యెక్కడో యెలియదు. టెలిఫోన్ డైరెక్టరీలో నీ పేరు కనబడలేదు. బంగ్లాకి చెందిన క్వార్టర్సుకి మారావు అని విన్నా, బాబే డ్రైవింగ్ నేర్పించారు. లైసెన్సూ ఆయనే తెప్పించారు. నేను డ్రైవర్ని పెట్టుకుందామని సజెస్ట్ చేస్తే బాబు హడలగొట్టారు. జాబ్ నేనే యిప్పించాలి, బిల్లు నువ్వు చెల్లించాలి, అప్పు యివ్వాలి, హాస్పటల్లో బెడ్ సప్లై చేయాలి. మళ్ళా నన్ను డియమ్‌ఓగా వేసేదాకా, నువ్వు కారు తోలు చాలు. మళ్ళా ఫ్యూన్ యెలాట్ అయినప్పుడు నువ్వు మానేద్దువుగాని అన్నారు.

యే పూరేస్తారంతగా వేస్తే, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, లేదా ప్రకాశం జిల్లా. బాబు డబ్బు చూపించరు, తాను చూడరు, ఉద్యోగంలో వున్నప్పుడే బాగా రెండు చేతులా సంపాయించాలి అని గుర్తు చేస్తూ వుండేవాడిని. నన్ను ఖాతరు చేయలేదు, ఈ చేత్తో వదిలింది ఆ చేత్తో లాగాలి, అదీ వుద్యోగ పాలసీ.

మళ్ళా మవ్వు చెప్పింది గుర్తు చేస్తాలే. నీ తమ్ముడు ఐ యె యెస్ కి అప్పియరైనాడా. ఈపాటికి యెమ్మెల్యే పాసై వుండాలే, అయిదేళ్ళు కాలేదూ నిన్ను చూసి అన్నది చల్లగా నవ్వుతూ.

వాడు!! వాడా! నన్నెదిరించి పరీక్ష యెగ్గొట్టి ఎక్స్ట్రా తాత నన్ను పెళ్ళాడతాననన్నది అని పెద్దగా నవ్వుతూ వూగి పోయాడు.

మరో వైపునించి కారు రావటం చూసి అటుగా వెళ్ళాడు వాగీశ్వర్రావు. చూస్తే బాబు ఆ కార్లోంచి దిగుతున్నాడు. యెదురుగా నిలబడి అన్నాడు.

నన్ను పార్ట్‌టైమ్ డ్రైవర్‌గా పనిలో పెట్టుకోండి సార్, అమ్మగారు రాష్‌గా డ్రైవ్ చేస్తున్నారు. మలుపు తిరిగేప్పుడు స్లో డౌన్ చేయటం లేదు, హారన్ కొట్టటం లేదు అని నవ్వాడు.

బాబు దిగి నిలబడి అన్నాడు. అక్కర్లా, కార్ల ధరలు బాగా పెరిగిపోయాయి. ఆ కారు రెట్టింపు ధరకి అమ్మబోతు న్నాను. సరికొత్త కారులాగా వుంచారని మెచ్చి బేరం సెటిల్ చేశారు కొనబోయేవారు.

దాని పాత పార్ట్స్, స్పేర్ పార్ట్స్, పాత బాటరీలు, పాత టైర్సు నాకిచ్చేయాలి సార్. అది రివాజు.

కాని నేను నీ అధికారినీ గాదు, నువ్వు నా డ్రైవరువీ కాదిప్పుడు. ఆ కారు కొన్నప్పుడున్న డ్రైవరడిగితే యివ్వా లేమో. ఆ టైమూ దాటిపోయింది. యెవరికింద పని చేస్తు న్నావో, వారిచేత వారి కారు పాతదైందని అమ్మించి, కొత్త కారు కొనిపించి, నువ్వడిగినవన్నీ యివ్వమను.

కాని ఆ బాబు ఆనెస్ట్ గాదు. రూల్సు తెలియవు. అమ్మ గారు టీయే యివ్వరు. మీరేమి పెట్టేవారో, యిచ్చేవారో చెప్పి అలా చేయాలి అన్నానో లేదో బాబు తాడిప్రమాణాన లేచి డిస్మిస్ చేస్తానన్నారు సార్! అందరి దగ్గరా డబ్బు లాగుతున్నావట, కారు టైర్లు మార్చి అమ్ముతున్నావట పట్టిస్తాను అన్నారు. నేనలాటివాడిని కానని మీరు ఆ బాబుతో చెప్పాలి సార్! అన్నాడు చేతులు నులుపుకుంటూ.

నువ్వే నిరూపించుకో యెలాటివాడివో అంటూ పక్కగా వెళ్ళి శివకామేశ్వరిని పిలిచి గుడిమెట్లు యెక్కసాగాడు బాబు.

-)(-)(-